క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాతలు

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి వారి సన్నిధిలో అమలు అవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి చల్లపేటకు చెందిన తంగుడు వెంకటరమణయ్య, గోవిందమ్మ దంపతులు రూ.1,01.116 విరాళాన్ని అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటిండెంట్ కె.వెంకటేశ్వరరావులకు చెక్కును దాతలు సోమవారం అందజేశారు. పర్వదినాల్లో ప్రత్యేక, విశిష్ట దర్శనాలకు దాతల పాసులను అందజేస్తామని సూపరింటెండెంట్ తెలిపారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్య వాకర్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక



గౌరీశంకరరావును అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ): ఆదిత్య వాకర్స్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు తెలిపారు. వాకర్స్ సంక్షేమానికి తామంతా కృషి చేస్తున్నామని, అనేక కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. కలెక్టర బంగ్లా సమీపంలోని పెద్దమ్మతల్లి ఆలయం ప్రాంగణంలో సోమవారం కార్యవర్గం ఎన్నిక జరిగింది.

నూతన కార్యవర్గం ఇదే..

అధ్యక్షుడిగా బురిడి గౌరీశంకరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.శాంతారామ్, కోశాధికారి గణేష్‌స్వామి, ఉపాధ్యక్షులుగా రామజోగినాయుడు, ప్రభాకర్ పట్నాయక్, కృష్ణప్రసాద్, జాలీవాకర్‌గా ప్రభాకర్, సంయుక్త కార్యదర్శులుగా రథో, వెంకటరావు, కొండబాబు, గౌరవ సలహాదారుగా నారన్నాయుడు, డైరెక్టర్లుగా భానుమూర్తి, దొంక రాములు, హరిని ఎంపిక చేశారు.

జానపద గీతాల ప్రదర్శనలో 'తరుణి' ప్రతిభ



బహుమతి అందుకుంటున్న తరుణి

శ్రీకాకుళం కల్చరల్: ముంబాయిలో హెచ్‌ఎస్‌బీసీ లైఫ్ ఇన్సురెన్స్ సౌజన్యంతో జియోవరల్డ్ మాల్‌లో ఇటీవల జరిగిన భారతీయ జానపద గీతాల పోటీలలో పట్టణంలోని గుజరాతిపేటకు చెందిన ఇన్ఫోసిస్ ఉద్యోగి పొట్నూరు తరుణి తన ప్రతిభను చాటింది. దేశం నలు మూలల నుంచి గాయకులు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ నుంచి కేవలం తాను మాత్రమే పోటీ చేసేందుకు అవకాశం దొరికిందని తరుణి తెలిపారు. ఈ ఈవేంట్‌లో ప్రముఖ గాయకులు శంకర్ మహదేవన్, భూమి త్రివేది (వెస్ట్ జోన్), అక్రితి కరార్ (ఈస్టుజోన్), హంసికా అయ్యర్ (సౌత్‌జోన్), లక్మిందర్ వాడాలి (నార్త్ జోన్) పాల్గొన్నారని చెప్పారు.


క్షయ వ్యాధిగ్రస్తులకు రూ.లక్ష విరాళం



రూ.లక్ష చెక్కు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం అందించేందుకు రెడ్‌క్రాస్ చెస్తున్న కృషికి తన వంతుగా ప్రముఖ శిశు వైద్యనిపుణుడు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావుకు రూ.లక్ష విరాళంగా అందించారు. క్షయ వ్యాధి నిర్మూలనకు, చిన్నారుల సాయం కోసం కొంచాడ విరాళం అందించడం అభినందించదగ్గ విషయమని జగన్మోహనరావు అన్నారు.

వాండ్రంగిలో పారిశుద్ధ్య పనులు



వాహనంతో చెత్తను తొలిగిస్తున్న దృశ్యం

జి.సిగడాం: వాండ్రంగి గ్రామంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయి. సర్పంచ్ సాకేటి నాగరాజు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి వడగా గౌరీశంకరావు పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. చీడిపేట-వాండ్రంగి ప్రధాన రహదారిలో ఉన్న చెత్త చెదారంను యంత్రాల ద్వారా తొలగిస్తున్నారు.

ఈక్రాప్ నమోదుతో

అన్నదాతకు భరోసా



ఈక్రాప్ నమోదు చేసిన పంటలను తనిఖీ చేస్తున్న రాష్ట్రస్థాయి అధికారుల బృందం(ఫైల్)

జి.సిగడాం: వ్యవసాయరంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారు. రబీ సీజన్‌లో రైతులు సాగు చేసే ప్రతి పంటను ఈక్రాప్‌లో నమోదు చేయడంతోపాటు వారికి కావాల్సిన సలహాలు, సూచనలతోపాటు రైతు చెంతకే ఎరువులు, విత్తనాలు అందించాలని ప్రభుత్వం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. వీటిలో ప్రధానంగా ఈక్రాప్ నమోదుతోపాటు రైతుకు చెందిన ఈకేవైసీ ఒకటి. ఇవి రైతులకు భరోసా ఇస్తోంది. వీటిని నమోదు చేసే పనుల్లో ఆర్‌బీకేల సిబ్బంది నిమగ్నమయ్యారు. వ్యవసాయశాఖ రూపొందించిన సాంకేతిక విధానం ద్వారా ప్రత్యేక యాప్‌లో పంటలు నమోదు అవుతాయి. రైతు పేరు, సర్వే నంబరు, ఎంత విస్తీర్ణంలో ఏయే పంటలు వేశారు వంటి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. విపత్తుల సమయంలో పంటలు నష్టపోతే కచ్చితంగా పరిహారం అందేందుకు ఈక్రాప్ ఉపకరిస్తోంది. ప్రస్తుతం గ్రామాల్లో ఈక్రాప్ నమోదు ప్రక్రియ జరుగుతుండగా.. మండల వ్యవసాయాధికారి పర్యవేక్షణ చేస్తున్నారు.

నమోదు ఇలా..

ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసి ఈక్రాప్ నమోదు చేస్తున్నారు. రైతు పంట వేసిన పొలం వద్దకు వెళ్లి ట్యాబ్‌లో యాప్ ఓపెన్ చేసి క్లిక్ చేయగానే 20 మీటర్ల పరిధిలోని సర్వే నంబర్‌లు కనిపిస్తాయి. రైతు పేరును నిర్ధారణ చేసుకొని యాప్‌లో పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. పొలం వద్దే రైతు ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసిన వెంటనే ఆధార్, ఫోన్ నంబర్ నమోదు చేయాలి. దీంతో ఆ సర్వే నంబర్‌కు ఏ కాలువ నుంచి నీరు వస్తోంది, నీటి సదుపాయ సమాచారం అందుతుంది. నీటి తీరువా ఎంత చెల్లించాలి అనే వివరాలు కూడా వస్తాయి. పంటల చిత్రాలను ట్యాబ్‌లో జీపీఎస్ పద్ధతి ద్వారా సర్వర్‌కు పంపుతారు. సర్వే నంబబర్‌లో తేడాలను అధిగమించేందుకు అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్వోలు సంయుక్తంగా ఈ నమోదు చేస్తున్నారు.

పక్కాగా సమాచారం



ఈ క్రాప్ యాప్‌లో పంటల వివరాలు నమోదు చేయడం ద్వారా విపత్తుల సమయంలో పంటల విస్తీర్ణం కచ్చితంగా తెలుస్తుంది. ఎటువంటి అవకతవకలకు చోటుండదు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం పక్కాగా అందుతుంది. పంట కోత ప్రయోగాలు చేసేటప్పుడు ఈక్రాప్ బుకింగ్ ఎంతో ఉపయోగపడుతుంది. ఈకేవైసీ, ఈక్రాప్ బుకింగ్‌కు రైతులు సహకరించాలి.

– యర్రా శారద, ఏవో, జి.సిగడాం

90 శాతం పూర్తి



జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రణస్థలం వ్యవసాయ సబ్ డివిజనల్‌లో ఈక్రాప్ నమోదు, ఈకేవైసీ ప్రక్రియను 90 శాతం వరకు అగ్రికల్చర్ అసిస్టెంట్లు పూర్తి చేశారు. రబీ పంటల నమోదులో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. రోజువారి ప్రగతిని సమీక్షిస్తున్నాం. ఇటీవల రాష్ట్ర వ్యవసాయ కమిషన్ కార్యాలయం ఏడీ కేజేడీ రాజన్ వచ్చి ఈక్రాప్‌ను పరిశీలించారు.

– వద్దాది శ్రీనివాసరావు, ఏడీఏ, రణస్థలం

టోల్ ప్లాజా ఉద్యోగులకు న్యాయం చేయాలి



ధర్నా చేస్తున్న టోల్ ప్లాజా కార్మికులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎచ్చెర్ల మండలం చిలకపాలెం టోల్ ప్లాజాను మూసివేయడంతో అనేకమంది ఉపాధి కోల్పోయారని, వారికి మడపాము, నాతవలస టోల్ గేట్లలో ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకపాలెం టోల్ ప్లాజాను అర్ధాంతరంగా (2022 డిసెంబర్ 7న) ఎత్తివేయడంతో ఇక్కడ పనిచేస్తున్న 106 మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఇక్కడి ఆదాయాన్ని జిల్లాలో సర్దుబాటు చేసిన నేషనల్ హైవే అధికారులు, ఇతర జిల్లాల్లో గల అనకాపల్లి, విశాఖపట్నం వంటి సుదూర ప్రాంతాల్లోని టోల్ ప్లాజాల్లో పనిచేసేందుకు 60 మంది కార్మికులను వెళ్లాలని చెప్పడం అన్యాయమన్నారు. దేశం కోసం సరిహద్దుల్లో కాపలా కాసిన అనేకమంది మాజీ సైనికుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని ప్రభుత్వానికి ప్రశ్నించారు. ఈ సమస్యను పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్‌కు యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. డి.వి.నర్సింహులు, వి.వెంకటరమణ, టి.అప్పారావు, పి.రాము, బి.శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఏపీడీ లోకేష్



ఎమ్మెల్యే కిరణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లోకేష్

రణస్థలం: ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను నియోజవర్గానికి నూతనంగా వచ్చిన ఉపాధిహామీ పథకం ఏపీడీ కె.లోకేష్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేతనదారులకు మెరుగైన వేతనాలు వచ్చేలా ప్రణాళికతో పని చేయించాలని సూచించారు. అన్ని గ్రామాల్లో పనులు జరిగేలా చూడాలన్నారు. రణస్థలం ఏపీవో ఎం.శ్రీనివాస నాయుడు, జేఈ గౌరీశంకర్ ఉన్నారు.

కళాకారులకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో కవులు, కళాకారులు పాల్గొనాలని ఉత్సవాల మీడియా ప్రతినిధి బమ్మిడి అమ్మోజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 48 గంటలపాటు జరిగే కళా ప్రదర్శనలో పాల్గొనే కళాకారులకు వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న కళాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిగా ఉచితమన్నారు. 82475 19925 నంబర్‌కు వాట్సప్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. తమ సంస్థ గతంలో 24 గంటలు, 32 గంటల కార్యక్రమాలను ర్వహించి ప్రపంచ రికార్డులో చోటు సంపాదించామన్నారు. 48 గంటలు నిర్విరామ కళా ప్రదర్శనలు, పుస్తకావిష్కరణలు, ప్రపంచ కవితోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు జి.సిగడాంలో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం

జి.సిగడాం: జి.సిగడాం, బాతువ గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ చేపడతారని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ సోమవారం తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు విధిగా హాజరు కావాలన్నారు. కాగా జి.సిగడాంలో సోమవారం కార్యకర్తలతో సమావేశమై స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మాజీ సర్పంచులు వెలది సాయిరాం, మహదాస్యం నారాయణరావు పాల్గొన్నారు.

దిగ్విజయంగా కాంగ్రెస్ ప్లీనరీ

- డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి

శ్రీకాకుళం అర్బన్: ఈ నెల 24 నుంచి 26 వరకు రాయపూర్‌లో జరిగిన 85వ కాంగ్రెస్ ప్లీనరీ దిగ్విజయంగా ముగిసిందని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్లీనరీ తమకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. దేశానికి దిశానిర్దేశం చేసే అంశాలతో భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ దేశానికి రాహుల్ గాంధీ నాయకత్వం కావాలని ప్రజల ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను, వారి ఆకాంక్షలను తెలియజేస్తూ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఈ ప్లీనరీలో ప్రసంగించారని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్ ప్లాంట్ విషయం, పోలవరం ప్రాజెక్ట్, విభజన చట్టంలోని పొందుపరిచిన అంశాలు అమలయ్యేలా చూడాలన్నారు. సోనియా గాంధీ రాజకీయాల నుంచి వైదొలగడం లేదనే వార్త చాలా సంతోషకరమని, రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా జోడో పాదయాత్ర చేయడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగిందన్నారు.

రాష్ట్రస్థాయిలో కొత్తపేట విద్యార్థి ప్రాజెక్టు ప్రదర్శన



విజయవాడలో ప్రదర్శించిన ఢిల్లేశ్వరరావు ప్రాజెక్టు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రస్థాయి సైన్స్ వాణిజ్య విజ్ఞాన ప్రదర్శన సోమ, మంగళవారాల్లో విజయవాడలో జరుగుతుంది. ఈ ప్రదర్శనలో కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి బొడిగి ఢిల్లేశ్వరరావు రూపొందించిన ప్రాజెక్టును సోమవారం ప్రదర్శించారు. సైన్స్ ఉపాధ్యాయులు ఎ.రవికుమార్ గైడ్‌గా 'ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ మ్యాన్ హోల్ పారాచ్యూట్ యాన్ ఇండికేటర్' అనే ప్రయోగం ప్రదర్శించాడు. జిల్లాస్థాయిలో ప్రాధాన్యతా క్రమం ఆధారంగా పది ప్రాజెక్టులను విద్యాశాఖ అధికారులు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపిక చేయగా, అందులో కొత్తపేట విద్యార్థిది ఒకటి. హెచ్‌ఎం మొదలవలస లక్ష్మణరావు ఢల్లేశ్వరరావును అభినందించారు.

నీరజకు 'నాట్యప్రభ' పురస్కారం



నీరజ, సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: అభినయ నృత్య నికేతన్ నృత్య దర్శకురాలు డాక్టర్ తమ్మరాజు నీరజ సుబ్రహ్మణ్యంకు పార్వతీపురం పట్టణానికి చెందిన కల్పనా కల్చరల్ సొసైటీవారు ఆదివారం 'నాట్య ప్రభ' పురస్కారంతో సత్కరించారు. కల్పనా కల్చరల్ సొసైటీ మూడు దశాబ్దాల వేడుక సందర్భంగా మధురమే సుధాగానం సంగీత విభావరి కార్యక్రమంలో భాగంగా ఈ పురస్కారం అందించినట్లు ఆమె సోమవారం తెలిపారు. నిరజ బృందం ప్రదరించిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ఈ పురస్కారాన్ని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, రిటైర్డ్ ప్రొఫెసర్ హేమంత్ కుమార్, రాష్ట్ర బీజేపీ నాయకుడు ఎస్.ఉమామహేశ్వరరావు, ప్రముఖ రచయిత గంటేడ గౌరునాయుడు, ఎస్‌వీడీ కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.చలపతిరావుల చేతుల మీదుగా అందుకున్నారు.

ఘనంగా ఎల్లమ్మతల్లి ఉత్సవాలు



శ్రీకాకుళం కల్చరల్: ఎల్లమ్మ తల్లికి పుజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కెల్లవీధిలో ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమైనాయి. కెల్ల వంశీయుల ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది శివరాత్రి వెళ్లిన తొమ్మిదో రోజు జరుగుతాయని నిర్వాహకులు కెల్ల కొండలరావు, కిశోర్ కుమార్ (చిన్ని) తెలిపారు. తమ పూర్వీకుల నుంచివస్తున్న ఆచారాన్ని పాటిస్తున్నామన్నారు. ఇంట్లో ఉన్న పుట్టకి పుజలు చేస్తామని, ఎంతో దూరప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకోడానికి ఇక్కడికి భక్తులు వస్తారన్నారు.

వమరవల్లి ఎల్లమ్మ జాతర ప్రారంభం

గార: వమరవల్లి ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవం సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. ప్రతి ఏటా జరిగే ఈ ఉత్సవానికి మూడు జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ప్రధాన పూజారులు పూజారి నర్సింహులు, నెయ్యిల రామారావు ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి, పోతన్న విగ్రహాలతోపాటు నాగసర్పాన్ని గజవాహనంపై ఊరేగించారు. సర్పంచ్ సుగ్గు లక్ష్మీభాయి, శాలిహుండం ఆలయ ధర్మకర్త సుగ్గు మధురెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్, ఎంపీటీసీ సుగ్గు లక్ష్మీనరసింహాదేవి ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహిస్తున్నారు. ఎస్‌ఐ ఎం.మధుసూదనరావు ఆధ్వర్యంలో 40 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మంత్రి ధర్మానను కలిసిన పృథ్వీరాజ్



శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును ఆయన క్యాంప్ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా స్టూడెంట్స్ విభాగం అధ్యక్షుడు మార్పు పృథ్వీరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు పార్టీ నాయకులు గొండు రఘురాం, ఎల్.నారాయణ ఉన్నారు.

మంత్రి ధర్మాన ప్రసాదరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పృథ్వీరాజ్

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలి



గ్రాడ్యుయేట్ ఓటర్‌కు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

లావేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థిగా పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కోరారు. బుడుమూరు, మురపాక, గుంటుకుపేట, చినమురపాక, చిన్నయ్యపేట, గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులైన ఓటర్లను కలిసి సుధాకర్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేసి కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధికి మద్దతు ఇవ్వాలన్నారు. గ్రామం యూనిట్‌గా ప్రతి ఓటరుకు ప్రభుత్వ పథకాలు వివరించి ఓట్లు వేయమని విజ్ఞప్తి చేయాలని స్థానిక నాయకులకు సూచించారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో అత్యధిక మెజారిటీలో విజయం సాధించేలా ప్రతి ఒక్క నాయకులు అంకితభావంతో పనిచేయాలన్నారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, ప్రజాప్రతినిధులు, నాయకులు రొక్కం బాలకృష్ణ, లుకలాపు శ్రీనివాసరావు, మీసాల శ్రీనివాసరావు, చాంద్‌బాషా, బొంతు సూర్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం బుడుమూరు గ్రామంలోని ఉగ్రనరసింహస్వామి వారిని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ దర్శించుకొని పూజలు చేశారు

ప్రజ్ఞా వికాస పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ



ప్రజ్ఞా వికాస పరీక్ష పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం జరిగింది. జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సి.హెచ్.రాజు, బి.హరీష్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు బహుళైచ్ఛిక ప్రశ్నల రూపంలో జిల్లాస్థాయి 'ప్రజ్ఞా వికాస పరీక్ష' నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినవారికి బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేస్తామన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.చందు, శ్రీకాకుళం టౌన్, సిటీ కన్వీనర్ స్వర్ణకుమారి, కమిటీ సభ్యులు వందన, భరణి తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన వైజ్ఞానిక ప్రదర్శన



ప్రాజెక్టులను తిలకిస్తున్న ఎంఈఓ సోమేశ్వరరావు

గార: ప్రతీ విద్యార్థి శాస్త్రవేత్త కావాలని ఎంఈఓ అలజంగి సోమేశ్వరరావు అన్నారు. సోమవారం కె.మత్స్యలేశం పరిధిలోని బుద్ధా స్కూల్‌లో జాతీయ సైన్స్ డే ఉత్సవాలను నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టులను పరిశీలించారు. విద్యార్థులు ఆవిష్కర్తలు కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్లాస్టిక్ వ్యర్థాలతో వాహనాలకు ఇందనం, ప్రకృతి సిద్ధమైన వస్తువులతో లాభసాటి వ్యవసాయం వంటివి ఆలోచింపజేశాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు నాటండి, పర్యావరణాన్ని రక్షించండి, మూఢ నమ్మకాలు వద్దు ఆరోగ్యమే ముద్దు వంటి లఘు నాటికలు విద్యార్థులు ప్రదర్శించారు. సర్ సీవీరామన్, అబ్దుల్ కలాం చిత్రపటాలకు నివాళులర్పించారు. సర్పంచ్ బి.లలిత, చైర్మన్ బి.ఎర్రన్న, మైలపల్లి మల్లేశ్వరరావు, ప్రిన్సిపాల్ తరిణి అర్జున్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. గుడ్‌టచ్- బ్యాడ్‌టచ్‌పై విద్యార్థులకు స్ఫూర్తి సిబ్బంది అవగాహన కల్పించారు. కె. వాసుదేవరావు. కె.రమణ, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో ప్రయోజనాలు



ద్రవ జీవామృతం తయారీ చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: జీవామృతంతో భూసారం పెరుగుతోందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రీసోర్స్ పర్సన్ ధనుంజయ్ అన్నారు. జరజాం పంచాయతీ గొలివివానిపేటలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో పొలంబడి నిర్వహించారు. పంటల సాగుపై సమగ్ర శిక్షణ నిర్వహించారు. అనంతరం ద్రవ జీవామృతం తయారీ, ప్రయోజనాలను వివరించారు. రబీ వరి సాగు యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించారు. లీడ్ ఫార్మర్ రామకృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మంచు వర్షం



దట్టంగా కురుస్తున్న మంచుతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. సోమవారం తెల్లవారు జాము నుంచి సుమారు ఉదయం తొమ్మిది గంటల వరకూ భారీగా మంచుకురిసింది. దీంతో వాహనాదారులు ప్రయాణాలకు ఇబ్బంది పడ్డారు. భారీ పొగమంచుతో మామిడి, జీడి పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. –జి.సిగడాం